ప్రజాశక్తి

గురువారం 5 సెప్టెంబర్ 2024 12 పేజీలు


గుంటూరు


పల్నాడు

మళ్లీ అల్పపీడనం

- వరద తగ్గినా తాజా హెచ్చరికలతో రైతుల్లో కలవరం
- మునిగిన పైర్లను చూసి ఆవేదన - సాయంపై దక్కని భరోసా


తాడేపల్లిలోని ఎత్తిపోతల పథకం సమీపంలో నీరు, తూటికాడ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఒకవైపు వరద తగ్గుముఖం పట్టిందని ఊరట చెందేలోపే మళ్లీ అల్పపీడన ఏర్పడిందని, దీన ప్రభావంతో గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సమాచారంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికీ పొలాల్లో నీరు తొలగక నష్టం పెరుగుతుందన్న ఆందోళన ఒకవైపు కొనసాగుతుండగా మళ్లీ వర్షాలు కురిస్తే ఇక ఎప్పటికి కోలుకుంటామన్న ఆవేదనలో రైతులున్నారు. నష్టం అంచనాలు వేసేందుకు పొలాల్లో నీరు తొలగకపోవడం ఒక ఆటంకంగా మారిందని అధికారులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో నీటిలో మునిగి నాలుగు రోజులపాటు నానిన పంటలకు మాత్రం పూర్తి స్థాయి నష్టం ఉంటుందని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఇంకా పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రాలేదని, రైతులకు ఎంత మేరకు పరిహారం లభిస్తుందనేది ఇంకా భరోసా కూడా దక్కలేదని, గత ప్రభుత్వం పంట నష్టపరిహారం కొంత మేరకు వేగంగానే చెల్లించిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇందుకు సంబంధించిన కార్యచరణా ప్రకటించలేదని రైతులు మధన పడుతున్నారు. మళ్లీ పంటలు వేయడానికి కావాల్సిన భరోసా కూడా ఇంకా రాలేదు.

గత నెల 31న కురిసిన అతి భారీ వర్షాలు, అనంతరం వచ్చిన వరదతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వేలాది మంది రైతులు

▶ 3లో

డబుల్‌హార్స్ రూ.10 లక్షలు వరద సాయం

ప్రజాశక్తి-తెనాలి

ప్రపంచ స్థాయి వ్యాపార సంస్థ తెనాలి డబుల్ హార్స్‌కు చెందిన తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్ రూ .పది లక్షల చెక్కును వరద బాధితుల సహాయార్ధం రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించినట్లు బుధవారం ఫౌండేషన్ ట్రస్టీ ఎం యజుర్వేద్ తెలిపారు. వరద, భారీ వర్షాలతో రాష్ట్రం అతలాకుతలం అయిన నేపథ్యంలో ప్రభుత్వం బాధితులను అందుకునేందుకు చేపట్టిన సహాయక చర్యలకు సంఘీభావంగా, సామాజిక బాధ్యతతో తమ వంతుగా సాయం అందించినట్లు ఆయన వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై ఫౌండేషన్ హర్షం వ్యక్తం చేసింది. వరద ప్రభావిత ప్రాంతాలను తిరిగి సహజ స్థితికి తెచ్చేందుకు ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి సహకరించాల్సిందిగా ఫౌండేషన్ కోరింది.



ఆహారాన్ని తరలిస్తున్న వాహనాలతో విద్యార్థులు

వరద బాధితులకు విజ్ఞాన్స్ చేయూత

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ విజయవాడలోని వరద బాధితులకు చేయూతగా ఆహారాన్ని అందించారు. ఆహారాన్ని తరలించటానికి వర్సిటీ నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 6 ప్రత్యేక బస్సులను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ జెండా ఊపి ప్రారంభించారు. 10వేలు కిచిడీ, పెరుగన్నం, వాటర్ ప్యాకెట్లను ప్రత్యేకంగా ప్యాకెంగ్ చేయించి బాధితులకు అందించామన్నారు. ఇది కష్టసమయమని, ప్రతి ఒక్కరూ స్పందించాల్సిన తరుణమన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు



బొమ్మిడాల ఫౌండేషన్ విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని వరద బాధితుల సహాయార్థం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ రూ.5 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి అందించారు. బుధవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఫౌండేషన్ ట్రస్టీ ప్రతీషా, సెక్రెటరీ వి.నాగేశ్వర రావు కలెక్టర్‌కు అందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న అసోసియేన్‌ప్రతినిధులు

పవర్ లిఫ్టర్లకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - మంగళగిరి

జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలు మాల్తా దేశంలో జరిగాయి. ఈ పోటీల్లో మంగళగిరి చెందిన షేక్ సాదియా ఆల్మాస్ పాల్గొని బంగారు పతకం సాధించింది. ఇదే పోటీలలో తెనాలికి చెందిన ఎం పానున్ పాల్గొని ఆరవ స్థానం సాధించింది. వీళ్ళిద్దరూ స్వదేశానికి బుధవారం తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి భాస్కర్ రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్కే సుభాని, వలపర్ల శ్రీనాథ్ ఉన్నారు.

బుకింగ్ చేసుకున్న వారే ఇసుక వద్దకు రావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇసుక అవసరమైన భవన నిర్మాణ యజమానులు, వినియోగదారులు బుకింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతే రావాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక బుకింగ్ చేసుకోడానికి జిపిస్ కలిగి ఉండి గనుల శాఖ వద్ద రిజిస్టర్ చేసుకున్న వాహనాలకు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతిస్తారన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా రవాణా శాఖ అధికారి లారీ యాజమానులు కలిసి దురాన్ని బట్టి రవాణా చార్జీలపై చర్చించి ధరలు నిర్ణయించినట్లు చెప్పారు. ఇసుక సరఫరా చేసే వాహనాలకు ఉచిత ఇసుక రవాణా వాహనం అనే బ్యానర్



ఏర్పాటు చేసుకొని ఇసుకను రవాణా చేయాలన్నారు. జిల్లాలో 6 ఇసుక స్టాక్‌యార్డ్‌లలో ఇసుక నిల్వలు ఉంచగా, వాటిలో 5 స్టాక్ యార్డ్‌లలో ఇసుక పూర్తిగా అయిపోగా మాదిపాడు స్టాక్ యార్డ్‌లో మాత్రమే 24,755 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఇక్కడ సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. వరద ఉధృతి తగ్గగానే డీసిల్టేషన్ పాయింట్‌ల ద్వారా 5,39,000 మెట్రిక్ టన్నుల ఇసుకను పల్నాడు జిల్లా వాసులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

వ్యాయామం, పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పౌష్టికాహారంతో పాటు వ్యాయామం ద్వారా పిల్లల్లో మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరగడంతో పాటు రక్తహీనత తగ్గుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల శంకరభారతిపురం జెడ్‌పి పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 1 నుండి 30 వ తేది వరకు పౌష్టికాహార మాసోత్సవాలు జరుగుతున్నాయన్నారు. గ్రోత్ మానిటరింగ్, కాంప్లిమెంటరీ ఫీడింగ్, పోషణ్ భి పడాయి భి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, ఓవర్ ఆల్ న్యూట్రిషన్ వంటివి కార్యక్రమ ముఖ్య ఉద్దేశంగా వివరించారు.

అత్యవసర చికిత్సలకు ప్రత్యేక వార్డు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో అత్యవసర ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆసుపత్రి ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 పడకలతో ప్రత్యేక వార్డును అత్యవసరంగా అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. రోగులకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వెంటనే ఈ వార్డుకు తరలించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. వరదల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే ఆసుపత్రికి రావాలని ఆయన సూచించారు.



ఏ పరిస్థితినైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి : ఎమ్మెల్యే ప్రవీణ్

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గంలో వరదల ప్రభావం, వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై అమరావతి మండల అధికారులతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం సమీక్షించారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో 18 గ్రామాలు వరద బారిన పడ్డాయన్నారు. ఇప్పటివరకు అధికారులు సమన్వయంతో పని చేసి బాధితులకు అవసరమైన సేవలను అందిస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో నష్టాన్ని భర్తీ చేసేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. ప్రతి గ్రామంలో ఫాగింగ్, బ్లీచింగ్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నా నేపథ్యంలో ఎలాంటి విపత్తును అయినా ఎదుర్కునేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతం ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో పార్టీ నాయకులను కలుపుకుని పూర్తి సహకారాన్ని అందించేందుకు ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటామని చెప్పారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని భరోసా కల్పించాలని సీనియర్ లెక్చరర్, జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.ఆదినారాయణ ప్రభుత్వాన్ని కోరారు. చాలీచాలని జీతాలతో పనిచేసే ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రతినెలా రూ.5 వేలివ్వాలని, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు.

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ షైక్ సైదా, రాష్ట్ర విజిలెన్స్ కమిటి మెంబర్ డాక్టర్ చదలవాడ హరిబాబు ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలో ఎరువుల దుకాణాల్లో అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హరిబాబు విలేకర్లతో మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. నిబంధనలు పాటించని కంపెనీలలు, దుకాణాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. త్వరలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలసి అన్ని హోటళ్లు, రెస్టారెంటులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లోనూ తనిఖీలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటి సభ్యులు పి.యజ్ఞనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని పెదమక్కెనలో ఎరువులు, పురుగుల మందుల దుకాణాన్ని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి



సత్తెనపల్లి పట్టణంలో ఎరువులు పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

ఐ.మురళీ బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల విక్రయించే సమయంలో తప్పని సరిగా బిల్లుపై రైతు ఫోన్ నంబర్, వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ స్టాకు బోర్డుపై ఎరువుల నిల్వల వివరాలు నమోదు చేయాలన్నారు. అమ్మిన ఎరువులను ఈ-పాస్ మెషిన్‌లోనూ ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని చెప్పారు. తనిఖీల్లో సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

ఆపత్కాలం.. ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :

వర్షాకాలం వ్యాధుల ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. డెంగీ, మెదడు వాపు, మలేరియా, బోదకాలు వంటి వ్యాధుల నియంత్రణకు దోమ తెరలు వాడాల్సి ఉంటుందని ఇంటి పరిసరాలను శుభ్రం ఉంచుకుంటేనే వ్యాధుల నుంచి బయటపడొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కూలెక్స్క్ దోమ వల్ల మెదడు వాపు వ్యాధి వస్తుందని దోమ కుట్టిన శరీరంలో 10 రోజుల్లో 1 నుంచి 14ఏళ్ల పిల్లలకు వచ్చే అవకాశముందన్నారు. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అసాధారణంగా కళ్లు తిరుగుతాయని పక్షవాతానికి గురయ్యే ప్రమాదంతో పాటు వాంతులు, విరేచనాలు అవుతాయన్నారు.

దోమ తెర వాడడంతో పాటు దోమలు ఇళ్లల్లోకి రాకుండా కిటికీలు తలుపులకు దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జనావాసాలు మధ్యన పందులు సంరించకుండా చూసుకోవాలి. మురుగు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి. తరచూ కొద్దిపాటి జ్వరం, ఆయాసం బోదకాలు ప్రాథమిక లక్షణాలు, పురుషులలో వరి బీజంతో పాటు గజ్జల్లో వాపు వస్తుంది. చికెన్ గున్యా జ్వరం పగటి పూట కుట్టే దోమల ద్వారా వస్తుంది. తీవ్రమైన జ్వరం, విపరీతమైన కీళ్లనొప్పులు ఉంటాయి. ఈ వ్యాధి సోకినప్పుడు భరించలేని ఒళ్లు, కీళ్ల నొప్పులు, జలుబు ఉంటుంది. వెంటనే అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. ఎడిస్ ఈజిప్ట్ వైరస్ దోమ వల్ల ఒకరి నుంచి మరొకరికి వైరస్ వ్యాప్తి చెందుతోంది. దోమ కుట్టిన తర్వాత 5 రకాల లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా వస్తోంది. తలనొప్పి అధికమవుతుంది. సాయంత్ర పూట జ్వరం రావడం, చలి వణుకు ఉంటోంది. రక్తపరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కొద్ది రోజులకు మాత్రమే ఇవి రక్త పరీక్షల్లో మలేరియా లక్షణాలు బయటపడతాయి.

అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ బి.రవి

కాయిల్స్, ఆల్ ఔట్, గుడ్ నైట్ కంటే దోమ తెరలు ఉత్తమం. పరిసరాలతో వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రతపాటించాలి. చిన్న పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

వరదల్లో చిక్కుకుని పెదమక్కెన వాసి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని పెదమక్కెనకు చెందిన వ్యక్తి విజయవాడ వరదల్లో మృతి చెందారు. గ్రామానికి చెందిన కేశరి శివారెడ్డి (52) సుమారు 25 ఏళ్ల క్రితం కుటుంబం సహా విజయవాడ వెళ్లి స్థిరపడ్డారు. సింగ్ నగర్ ఆంధ్రప్రభ కాలనీలో ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం వచ్చిన వరదల్లో ఆయన గల్లంతవగా మృతదేహం మంగళవారం బయటపడగా బుధవారం ఉదయం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతునికి భార్య కృష్ణకుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



వాగులో తుటికాడ తొలగింపు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

మండలంలోని నందిగామ వాగులో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తుటికాడను పంచాయతీ అధికారులు బుధవారం తొలగింపజేస్తున్నారు. వర్షాలకు వాగు పొంగి పొర్లి ప్రవహించటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుటికాడ వల్ల వరద నీరు పోయేందుకు మార్గం లేక చప్టాపై నుండి వాగు ప్రవహిస్తోంది. దీంతో సత్తెనపల్లి నుండి కార్మికులును రప్పించి పడవ సహాయంతో తుటికాడను తొలగించారు. పనులను టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, సర్పంచ్ బి.రమాదేవి విజయ్ కుమార్ పర్యవేక్షించారు.

బురద మయంగా గ్రామాల్లో రోడ్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వర్షాలకు అంతర్గత రహదారులు బురదమయంగా మారాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లు బురద మయంగా మారటంతో గ్రామస్తులు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివారు కాలనీల్లో మట్టి రోడ్లు బురద మాయమయ్యాయి. మట్టి రోడ్లతో పాటు డ్రెయినేజీ కాల్వలు లేక పోవటంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు రోగాల బారిన పడడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



దేశభక్తిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - అమరావతి

పల్లోటి జూనియర్ కాలేజీ ఆవరణలో దేశభక్తిపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. పల్లోటి ఫాదర్ వినోద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పిబి శేఖర్ ఆర్మీ జవాన్ మాట్లాడారు. పల్లోటి జూనియర్ కాలేజ్ లాంటి కళాశాలలు మన పరిసర ప్రాంతాల్లో ఎక్కడ లేవని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీరు బాగా చదివి మీ తల్లిదండ్రులకు కాలేజీకి మంచి పేరును తీసుకురావాలన్నారు. పల్లోటి కాలేజీ డైరెక్టర్ ఫాదర్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రేమ త్యాగం శ్రమ అనే సుగుణాలతో ఎదిగి వరదబాధితులకు తమ వంతు సహాయాన్ని అందించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలను ప్రకృతి వ్యవసాయ విధానంలో సంరక్షించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారిణి కె.అమలకుమారి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో ప్రకతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అవినీతి, అక్రమాలపై మాజీ ఎమ్మెల్యే ధ్వజం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న విజయ్ అనే వ్యక్తి ఎవరని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. బుధవారం గుంటూరు వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 నెలలకే ఎమ్మెల్యే కుమారుడి బావ మరిదినంటూ విజయ్ అనే వ్యక్తి దందాలు చేస్తున్నాడన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో 10 ప్రాంతాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని కోడి పందేలు నిర్వహణకు విజయ్ అనే కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్నాడని ఆరోపించారు. నరసరావుపేట నియోజకవర్గ ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడను ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఇప్పటికైనా స్పందించి అక్రమ సంపాదనపై కాకుండా నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేయాలని మాజీ ఎమ్మెల్యే హితవు పలికారు.

పత్తి పంట పరిశీలన

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని పాటిబండ్ల గ్రామంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి బుధవారం పరిశీలించారు. పంట నష్టం అంచనా జాబితాను పారదర్శకంగా సెప్టెంబర్ 10 లోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. గ్రామ రైతులకు ప్రస్తుతం ప్రత్తి పంటలో తీసుకోవలిసిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు.

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి సబ్-డివిజన్ పరిధిలో గల మంగళగిరి టౌన్, రూరల్, తాడేపల్లి, దుగ్గిరాల, పెదకాకాని మండలాల పరిధిలోని ప్రజలు వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మంగళగిరి డిఎస్పి సిహెచ్.మురళికృష్ణ బుధవారం తెలిపారు. అనుమతి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ ద్వారా లేదా 7995095800 నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెస్సేజ్ చేస్తే లింక్ వస్తుందని, అందులో అప్లికేషన్ నింపి దరకాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గతంలోలా పాత పద్ధతిలో సంబంధిత పత్రాలు జతచేసి లౌడ్ స్పీకర్స్‌కి చలానాలు కట్టి అనుమతి పొందాలని కోరారు. మండపాలను ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిమజ్జనం రూట్ మ్యాప్ ఇస్తూ, నిర్దేశించిన ప్రాంతాలలో మాత్రమే నిమజ్జనం చేయాలని తెలిపారు. ప్రజాశాంతికి భంగం కలగకుండా పోలీస్, ఇతర అధికారుల సూచనలు పాటిస్తూ శాంతియుతంగా గణేష్ నవరాత్రులు నిర్వహించుకోవాలని కోరారు.

ముంపు బాధితులకు దాతల సాయం





ప్రజాశక్తి-చిలకలూరిపేట

విజయవాడలో వరద బాధితులకు ఆహారాన్ని, మంచినీటిని అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ చిలకలూరిపేట విలేకరుల సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అన్నారు. విజయవాడలో వరద విపత్తులో చిక్కుకొని అలమటిస్తున్న బాధితుల కోసం ప్రెస్‌క్లబ్ చిలకలూరిపేట, దాతల సహకారంతో 1000 మందికి సరిపడ విజిటేబుల్ పలావు, మంచినీటి బాటిళ్లను తరలించారు. ఆహారాన్ని తీసుకువెళ్లే వాహనాన్ని ప్రత్తిపాటి పుల్లారావు జెండా ఊపి ప్రారంభించారు. దాతల సహకారంతో ఆహారాన్ని, మంచినీటిని అందజేస్తున్నామని ప్రెస్‌క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షులు అడపా అశోక్ కుమార్ తెలిపారు. దాతలు గర్రె. బాబురావు, కేవి.కోటీశ్వరరావు, ఎన్.హనుమం తరావు, దొరడ్ల. కోటేశ్వరావు, కే. శ్రీనివాసరావులకు అభినందనలు తెలియజేశారు.

ప్రజాశక్తి- చిలకలూరిపేట

మండల పరిధిలో వేలూరు గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘం వారు విజయవాడ వరద బాధితులకు ఆహారం, మంచినీటిని బుధవారం అందచేశారు. కార్యక్రమంలో సంఘ కాపరి గుండాల ఇస్రాయేలు , సంఘ పెద్దలు, సంఘస్తులు తదిత రులు పాల్గొన్నారు.

చేయుతలో ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి కారంపూడి

విజయవాడ వరద బాధితులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం సహాయ సహకారాలు అందించారు. ముంపు ప్రాంతంలో నీటిలో నడుచుకుంటూ బాధితులను కలుసుకొని వారికీ అవసరమైన ఆహార పొట్లాలు, పాలు, మంచి నీరు, బిస్కెట్ ప్యాకిట్లను అందించారు. ఈ సందర్భంగా వరద బాధిత ప్రజలు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి. బ్రహ్మానందరెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ యువనాయకులు జూలకంటి. అక్కిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

విజయవాడ వరద భాదితులకు కూటమి ఆధ్వర్యంలో బుధవారం ఆహార పంపిణీ చేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గొంట్ల శ్రీనివాసరావు మాట్లడుతూ ప్రభుత్వ నేతల పిలుపు మేరకు టంగుటూరి వెంకట సుబ్బారావు చారిట్రబుల్ ట్రస్ట్, శారదా ట్రేడింగ్ కెంపెనీ ప్రతినిధులు సుధరాణి, శేషు కుమార్, కోన వెంకటేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీనివాసరావు, 13,14వార్డు ఇన్‌ఛార్జి సుతారు నాగమల్లేశ్వరావు ఆధ్వర్యంలో ముంపునకు గురైన ప్రాంతాల్లోని బాధితులకు పులిహార, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు, స్వీట్లు, టాటా వాటర్ బాటిల్స్ 300కేసులను అందజేయడానికి వాహనాలను తరలించారు. ముందుగా వాహనాలకు జెండా ఉపి ప్రారంభించారు.

ప్రజాశక్తి -పెదకూరపాడు

మండల పరిషత్‌కార్యాలయం నుండి విజయవాడ వరద బాధితులకు ఆహార పదార్థాలను బుధవారం పంపారు. మంచినీళ్ళ బాటిళ్లు, బిస్కెట్లు, అగ్గిపెట్టెలు ,కొవ్వొత్తులను అందించారు. వాటర్ బాటిళ్లను పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు సహకారంతో తెచ్చినట్లు ఎండిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎంపీడీవో కే నరసింహారావు, యువోపిఆర్డి అయనంపూడి శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయవాడవరద బాధితుల సహాయార్థం నరసరావుపేట మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీరు డబ్బాలు, కొవ్వొత్తులు, అగ్గి పెట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లను ఏర్పాటు చేశారు. నరసరావుపేట ఎంపిడిఓ నాగిశెట్టి వెంకటేశ్వరరావు తన సిబ్బంది ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం మినరల్ వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్, బట్టలు, మరియు క్యాండిల్స్‌లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సేకరించారు. వాటిని విజయవాడ వరద బాధితులకు అందజేసేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేర్చి జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంకు అందజేశారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విజయవాడ వరద ముంపు బాధితుల సహాయార్థం బియ్యం నిత్యావసర సరుకులు కూరగాయలు బట్టలు సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామస్తులు పంచాయతీ అధికారులకు బుధవారం అందచేశారు. గ్రామస్తులు సుమారు రూ.రెండు లక్షలు విలువైన బియ్యం, కూరగాయలు, బిస్కెట్లు వాటర్ బాటిల్స్ టవల్స్, చీరెలు, దుప్పట్లు అందించి ఉదారతను చాటుకున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు సహాయం చేశారు. వీటిని ప్రత్యేక వాహనంలో విజయవాడలో పర్యటిస్తున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు టిడిపి నాయకులు ఆళ్ళ సాంబయ్య గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి వి మురళీ కృష్ణ ఆధ్వర్యంలో అధికారులు ముంపు బాధితుల కోసం 10వేల బిస్కెట్ ప్యాకెట్లు, 20వేలు వాటర్ బాటిల్స్ అగ్నిపెట్టెలు , క్యాండిల్స్ ను ప్రత్యేక వాహనంలో విజయవాడ కు పంపించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కె యస్ చక్రవర్తి పౌర సరఫరాల శాఖ అధికారి అరుణా దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

వరద బాధిత కుటుంబాలకు తమవంతు చేయూత ఇచ్చేందుకు నియోజకవర్గ ప్రజా నేస్తం ముందుకు వచ్చింది. బుధవారం ఆ సంస్థ నిర్వాహకులు 4వేల రొట్టెలు, 4వేల వాటర్ (1లీటర్) విజయవాడకు పంపించారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గపూర్ , తొండపి రషీద్ గుడిపూడి సుభాని , రుద్రావరం బాబావలి , ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు .

ప్రజాశక్తి - అమరావతి

రానున్న రెండురోజులు వర్షం, వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయం నుండి 1500 మంది నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా వచ్చిన వరదలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారన్నారు. విపత్తును ఎదుర్కొనేలా నాయకులు, అధికారులు సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. రానున్న రెండు రోజుల్లో కూడా భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నాయని, అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. వరద నీటి ప్రభావంతో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గత ఐదు రోజులుగా ఎడతెరిపిలేని అధిక వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను బుధవారం టిడిపి, జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ ఆదేశాను సారం అధిక వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నామనీ అన్నారు. పంట పొలాలు ముంపుకు గురికాకుండా తగు చర్యలు తీసుకునేందుకు అధికారులతో చర్చిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇప్పటం గ్రామ అధ్యక్షులు శంకర శెట్టి పిచ్చయ్య, జెముడుగాని రత్తయ్య, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లో వరద బాధితులకు ఆహార పొట్లాలను మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందజేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటిసి ఎస్.నారాయణప్రసాద్ ఉన్నారు. పట్టణానికి చెందిన రోటరీక్లబ్ ఆప్ తెనాలి వైకుంఠపురం బృందం ముంపు గ్రామాల్లో బాధితులకు భోజనవసతి కల్పిస్తుంది. బుధవారం భోజనంతో పాటు పెసర్లంక ప్రాంతంలో పిహెచ్‌సి బృందానికి వైద్యశిబిరానికి సరిపడా మందులు పంపిణీ చేశారు.కార్తీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరుసగా మూడు రోజులపాటు గాజుల్లంక గ్రామంలో బాధితులకు మంచినీరు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అద్యక్ష, కార్యదర్శులు ఇ.శ్రీనివాసరావు, దేవయజనం, మురళీకృష్ణ, ఈదర వెంకటపూర్ణచంద్ ఉన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

వరదలు వంటి విపత్తుల్లో ప్రజలను సాధ్యమైనంత మేర ఆదుకోవాల్సింది పోయి వాటిని కూడా రాజకీయాలకు వాడుకోవడం వైకాపా, జగన్ రెడ్డి రాక్షసత్వానికి పరాకాష్ట అని ధ్వజమెత్తా రు తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. పీకల్లోతు నీళ్లలో మునిగి ఉన్న ప్రజలకు ఈ సమయంలో కావాల్సింది ఆహారం, ఔషధాలు, తక్షణ సాయం అని మరిచిపోయి పనికి మాలిన మాటలు మాట్లాడితే ఎలా ప్రశ్నించారాయన. వారి అడ్డగోలు అబద్ధాలు, తప్పుడు ప్రచారాలను ప్రజలు చీ కొట్టి తిరస్కరించినా ఇంకా అదే రీతిలో ప్రజల్ని మోసగించవచ్చని అనుకుంటే పొరపాటే అని చురకలు వేశారు. కష్టం వచ్చిన 5రోజుల తర్వాత విధి లేని పరిస్థితుల్లో విమర్శలకు జడిసి లండన్ పర్యటన రద్దు చేసుకున్నా మాజీ సీఎం జగన్ రెడ్డి బుద్ధి మాత్రం మారినట్లు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఒకవేళ అవే గనక నిజమైతే బాధ్యులైన వారిని ఎవరూ కాపాడలేడని హెచ్చరించారు.

విద్యార్థులకు ఇచ్చే ఆహారం నాణ్యతగా ఉండాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. నరసరావుపేట మండలంలోని శంకరభారతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమానికి విచ్చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని ప్రధానోపాధ్యాయురాలు శివ పార్వతిని ఆదేశించారు. తాజా కూరగాయలతో వంటలు చేయడం నాణ్యతను పాటించడంతో పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.



ఆహార పదార్థాల నాణ్యత పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



కిట్‌లోని సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్

నిత్యావసర కిట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక గుంటూరు బస్‌స్టాండ్ సమీపంలోని పౌర సరఫరాల గిడ్డంగిలో వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న నిత్యావసర సరుకుల కిట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ పరిశీలించారు. తాడికొండ, గుంటూరు అర్బన్, గుంటూరు రూరల్, మంగళగిరి, తాడేపల్లి మండ లాలకు చెందిన 2700 కుటుంబాలకు పంపిణీ చేయడానికి ఇక్కడ కిట్లు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒక్కొక్క కిట్‌లో 25 కిలోల బియ్యం, కె.జి కందిపప్పు , కే.జి పంచదార , కెజి పామాలిన్ ఆయిల్, కెజి బంగాళాదుంప, కేజీ ఉల్లిపాయాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మత్స్యకారులు , వీవర్స్ కుటుంబాలకు 50 కే.జీల బియ్యం అందించాల్సి వుందన్నారు. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాలకు సంబంధించి తెనాలి పౌర సరఫరాల శాఖ గిడ్డంగి నుండి నిత్యావసర సరుకులను వరద భాదితుల సహాయార్థం పంపడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నందివెలుగు రోడ్డులోని ఎంఎస్ఎల్ గోడౌన్‌లో వున్న బియ్యం నాణ్య తను, తూకం, ప్యాకింగ్ విధానం పరిశీలించారు. కార్యక్ర మంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ జి.లక్ష్మీ, గుంటూరు తూర్పు మండల తహశీల్దార్ నగేష్ పాల్గొన్నారు.



చెక్కును సిఎం చంద్రబాబుకు ఇస్తున్న సొసైటీ ప్రతినిధులు

నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.25 లక్షల విరాళం

ప్రజాశక్తి-గుంటూరు :వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి నాగార్జునా ఎడ్యుకేషనల్ సొసైటీ, అనుబంధ సంస్థల తరపున రూ.25 లక్షల విరాళం అందజేశారు. ఈమొత్తాన్ని బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకి సొసైటీ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ జాగర్లమూడి మురళీ మోహన్, ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాధితుల కోసం సిపిఎం విరాళాలు సేకరణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : సిపిఎం ఆధ్వర్యంలో కాజా గ్రామంలో అపార్ట్మెంట్స్‌లో వరద బాధితుల కొరకు సహాయ నిధి, వస్తువులు సేకరించారు. స్పందించిన ప్రజలు రూ. 28,400 విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు ఏ .సాంబి రెడ్డి, జి. మాధవరెడ్డి , కే .గోపాల్ రెడ్డి, జి .గోపాల్ రెడ్డి, బి. సత్యమారెడ్డి, టి. ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-తాడేపల్లి: తాడేపల్లి పట్టణంలోని నులకపేట రామయ్య కాలనీలోని రాయల్ హైస్కూల్లో ఉన్న ముంపు బాధితులను సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు, స్థానిక నాయ కులు ఎం.మల్లేశ్వరి, తమ్మిశెట్టి వేణుగోపాల్ పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న భోజనం నాసిరకంగా ఉందని బాధితులు చెప్పారు. దుర్గారావు మాట్లాడుతూ రామయ్యకాలనీలో కొన్ని ఇళ్లు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోటార్లు ద్వారా వెంటనే నీటిని బయటకు పంపించాలని అధికారులను కోరారు.

ప్రభుత్వం, అధికారుల అలసత్వంతోనే ముంపు

కొండవీటి హెడ్‌స్లూయిస్ గేట్లు మరమ్మతులు చేయనందునే ముప్ప

పంట పొలాలను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి



కొండవీటి వాగుతో పాటు కృష్ణానది పరివాహక ప్రాంతంలోని పంట పొలాలను బుధవారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. కొండవీటి వాగులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడను పరిశీలించారు. ప్రభుత్వం ముందస్తుగా మేల్కొని ఉంటే కొండవీటి వాగులో ఈ పరిస్థిత ఇఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రూ.270 కోట్లతో నిర్మించిన కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం పని చేస్తున్నా వాగులో వరద ఉధృతి తగ్గడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వాగు హెడ్‌స్లూయిస్ గేట్లు రిపేర్‌తో ఉండటం వల్ల వరద వెనక్కి తన్ని ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మరమ్మతులు చేసి ఉంటే రాజధానిలో గ్రామాలు ముంపు బారిన పడేవి కావన్నారు. కరకట్ట మధ్యలో, నదీ పొడవునా ఉన్న భూముల్లో బహుళ అంతస్తుల భవనాలతో పాటు ప్రహరీ గోడలు నిర్మించడం, కృష్ణానదిలోకి చొచ్చుకు వచ్చి నిర్మాణాలు చేపట్టడం వరద ఉధృతికి కారణమని విశ్లేషించారు. కృష్ణానదిలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, రాజధాని రైతు సంఘం అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి, వీరాస్వామి, వెంకటరెడ్డి, డి.పద్మనాభరెడ్డి, డి.సాంబశివరావు, బక్కిరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి -కొల్లిపర : వరదలతో నష్టపోయిన పంట నష్టాన్ని అంచనావేసి రైతులకు,కౌలురైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘంం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్ వలితో కలిసి కొల్లిపర మండలంలోని బొమ్మువానిపాలెం అన్నవరపు లంక గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన పసుపు కంద అరటి పొలాలను పరిశీలించి పంట నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పసుపునకు ఎకరాలకు లక్ష, అరటికి రూ.50వేలు, కందపంటకు రూ.60వేలుఖర్చు అయ్యిందని రైతులు తెలిపారు. పశువుల కోసం నిల్వపెట్టుకున్న ఎండుగడ్డికూడా కొట్టుకుపోయిందని సిపిఎం నాయకులకు రైతులు తెలిపారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- పునరావాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - పెదకాకాని, గుంటూరు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నన్నపనేని శివాజి

వరదకు ముంపుకి గురైన ప్రాంతాల్లో కలెక్టర్ బుధవారం పర్యటించారు. పెదకాకాని మండలం సుందరయ్య కాలనీ దర్గా ప్రాంతాలలో పర్యటించి సుందరయ్య కాలనీలో ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గత ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు సుందరయ్య కాలనీలో నివాసాలన్నీ మునిగిపోయి కట్టుబట్టలతో మిగిలారన్నారు. వారికి పునరావాస కేంద్రానికి తరలించారన్నారు. నీరు తగ్గడంతో వారు తిరిగి వచ్చారని, అయితే ఇళ్లల్లో మేట వేసిన బురద తొలగించుకోవడం చేస్తున్నారన్నారు. నిత్యావసరాలన్నీ, పుస్తకాలు, నీటమునిగి పనికిరాకుండా పోయాయని, వారి సాయం చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ పూర్తి చేసి గురువారం ఉదయానికి నిత్యావసర సరుకులు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్యూమరేషన్ చేసేటప్పుడు ఆ ఇంటిలో పిల్లలు ఏ తరగతి చదువుతున్నారో తెలుసుకోవాలని, వారికి పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను కలెక్టర్ పరిశీలించారు. వెంకటకృష్ణాపురం జాకీర్ హుస్సేన్ నగర్ వద్ద గుంటూరు ఛానెల్ , హై లెవెల్ ఛానెల్ , మురుగు డ్రైన్ ద్వారా వచ్చిన వరద నీటి ద్వారా మునిగిన పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. పెదకాకాని మండల చివరి పంట భూములు 11 వేల ఎకరాలు ఉండగా, వాటిలో తొమ్మిది వేల ఎకరాలలో 40 రోజుల పంట నీట మునిగినట్లు రైతులు కలెక్టర్‌కు తెలియజేశారు. నీట మునిగిన పంటకు ఆక్సిజన్ అందకా చనిపోతుందని వాపోయారు. ఇక్కడ అధిక సంఖ్యలో కౌలు రైతులు వున్నారని , వీరికి సీసీఆర్సీ కార్డులు కూడా లేవని , ఒక్కొక్కరు ఎకరానికి రూ.15వేలు నుండి రూ.20 వేల వరకూ నష్టపోయారన్నారు. హాఫ్‌పేట మురుగు డ్రైన్ ద్వారా పంట పొలాలు మునిగిపోకుండా డ్రైన్ కు మరమ్మత్తులు చేపట్టి , పూడికతీసి బాగుచేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో యంపీడీఓ మల్లేశ్వరరావు , తహశీల్దార్ కష్ణకాంత్ , విలేజ్ సెక్రెటరీ రాజారావు , పీహెచ్‌సీ డాక్టర్ రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

నరెడ్కో రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి-గుంటూరు : వరద బాధితుల సహాయార్థం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. బుధవారం నరెడ్కో గుంటూరు జిల్లా బిల్డర్స్ అసోసి యేషన్ ప్రతినిధులు వరద బాధితుల కోసం రూ.10 లక్షలు అందచేశారు. ఈమొత్తాన్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ నాగలక్ష్మికి కలెక్టర్ ఛాంబర్‌లో అందచేశారు. అలాగే వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చెలికాని సీతారా మయ్య రూ.10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో నరె డ్కో ప్రతినిధులు పి.నాగవంశీ, పి.శ్రీనాధ్, ఎస్.మధుసూద న్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, కెసిహెచ్. తిరుపతయ్య పాల్గొన్నారు.

పెమ్మసాని ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి - తుళ్లూరు

రెండు వేల మంది వరద బాధితులకు పెమ్మసాని ఫౌండేషన్ చేయూతనిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు రవిశంకర్ వెంకటపాలెం ఎంపిపి ఎలిమెంటరీ స్కూల్ పునరావాస కేంద్రం లోని బాధితులతో మాట్లాడారు. వంద మందికి రగ్గులు పంపిణీ చేశారు. తాళ్లాయపాలెం ఎస్సీ కాలనీలోని 400 మందికి, ఉద్దండ రాయునిపాలెం బాప్టిస్టు చర్చిలోని 450 మందికి, లింగా య పాలెంలో 400 మందికి, రాయపూడిలో 300 మందికి, హరిశ్చం ద్రాపురంలో 300 మందికి రగ్గులు, మంచినీటి క్యాన్లు పంపిణీ చేశారు.ఏ చిన్న కష్టమొచ్చినా పిలుపు దూరంలో ఉంటామని, పెమ్మసాని ఫౌండేషన్ ద్వారా చేయూతనిస్తామని భరోసా కల్పించారు. పెద పరిమికి చెందిన టిడిపి నేత కావూరి దాసు రూ.50 వేలు చెక్కు విరాళంగా అందజేశారు.



స్కూల్ డైరెక్టర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కాటూరి పబ్లిక్ స్కూల్లో ఉపాధ్యాయులకు పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు రూరల్, లాల్‌పురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గురుపురస్కారాలు అందజేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు, స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి ఉత్తమ పౌరులను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. తల్లి దండ్రుల తర్వాత అంతటి గొప్ప స్థానం ఉపాధ్యాయులకే ఉందని, వారిని అందరూ గౌరవించాలని అన్నారు.అనంతరం ఉపాధ్యా యులకు లక్ష్మణరావు పురస్కారాలు అందించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటులో అవకతవకలు సరిచేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : ఉపాధ్యాయుల పనిసర్దుబాటు ప్రక్రియలో జరిగిన అవకతవకలు సరిచేయాలని మోడల్ టీచర్స్ యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మేడ్ నాయకులు పాఠశాల విద్య ఆర్‌జెడి లింగేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చందోలు రవికుమారర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలలో మిగులు ఉపాధ్యా యులను గుంటూరు నగరపాలక సంస్థలో సర్దుబాటు చేయటం నిబంధనలకు వ్యతిరేకం అని అన్నారు. కనుక వారిని వెంటనే తిరిగి వారి యాజమాన్య పరిధిలోని జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఆర్‌జెడిని కలిసిన వారిలో మేడ్ రాష్ట్ర అధ్యక్షులు యం.దేవపాల్, నగర అధ్యక్షులు వై.మనో జ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అర్ఫతుల్లా ఉన్నారు.



కొనసాగిన భోజన ఏర్పాట్లు

ప్రజాశక్తి -తాడేపల్లి

బాధితులకు సిపిఎం బుధవారం కూడా తన ఆపన్నహస్తాన్ని అందజేసింది. మహానాడు ఒడ్డున రెండు ప్రాంతాల్లో బాధితులకు భోజన సౌకర్యం కల్పించారు. భోజనంతో పాటు మంచినీటి కూడా సరఫరా చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి వరద బాధితులకు తగిన మంచినీటి సౌకర్యం అందడంలేదు. సిపిఎం నేతృత్వంలో భోజనంతో పాటు మంచినీరు కూడా సరఫరా చేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక దశలో సిపిఎం అందిస్తున్న అల్పాహారం దగ్గర ప్రజలు బారులు తీరి నిలబడ్డారు. టిడిపితో పాటు అక్షయపాత్ర ద్వారా వస్తున్న భోజన ప్యాకెట్లను కూడా వివిధ ప్రాంతాల్లో టిడిపి నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంబివికె బాధ్యులు పి.మురళీకృష్ణ, పి.విజయ, సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు వేముల దుర్గారావు, డివి భాస్కరరెడ్డి, ఎస్.వెంకట్రావు, కె.ఉషారాణి, బి.రామారావు, యు.సాయి, లక్ష్మణ, సీతమ్మ, ఎస్.రాము, సరస్వతి, పాప, వై.బర్నబస్, బిట్రా రామారావు తదితరులు పాల్గొన్నారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన భోజన ఏర్పాట్లకు విజయవాడ ఎపి ట్రాన్స్‌కో అధికారి బి.శ్రీరామచంద్రమూర్తి, సుస్మిత ఆర్థిక సాయం అందజేశారు. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రానికి వరద బాధితుల సహాయార్థం పెనుమాక జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు పి.రమేష్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. గత రెండు రోజుల నుంచి ఎంబివికె నుంచి జరుగుతున్న భోజన సరఫరాలో ఉపాధ్యాయులు కూడా పాల్గొని తమ సేవలు అందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు జిల్లా
పల్నాడు జిల్లా

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన రఘునాథరావు

జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ఆయన సొంతం

ప్రజాశక్తి-తెనాలి

వృత్తిలో అంకిత భావం, నిబద్ధత ఆయన సొంతం. సామాజిక దృక్పదంతో విద్యార్థులను తీర్చి దిద్దటం ఆయన దినచర్య. విద్య మాత్రమే మనిషిని సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్న నమ్మకాన్ని విద్యార్థుల్లో నింపుతారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో కూడా సన్నిహిత సంబందాలు కొనసాగిస్తూ విద్యార్థులకు వెన్నంటే ఉంటారు. దాదాపు 30ఏళ్ళ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో ప్రతిష్టాతమ్మకమైన పురస్కారాలను దక్కించుకున్న సెంకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మునిపల్లి వెంకటరఘునాధరావు ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారనటంలో సందేహం లేదు. మునిపల్లి చిన్నికృష్ణమూర్తి, వెంకట సుబ్బమ్మ దంపతుల కుమారుదు మునిపల్లి వెంకట రఘునాధరావు నాజరుపేట లూథరన్ ప్రాథమికోన్నత పాఠశాల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. దాదాపు 30 ఏళ్ళ తను ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసిన విధానాన్ని ప్రజాశక్తితో పంచుకున్నారు. పాఠశాలకు రాని విద్యార్థుల ఇంటింటికీ వెళ్ళి తల్లిదండ్రులతో మాట్లాడ తారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాలను స్పష్టంగా వివరిస్తారు. టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ ను ఉపయోగించి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అర్థమయ్యే రీతిలో బోధన కొనసాగిస్తారు. నీతి కథల పుస్తకాలు విద్యార్థులతో చదివిస్తారు. సామాజిక చైతన్యం కలిగిన దాతల సాయాన్ని అందిపుచ్చుకుని పాఠశాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తారు.



పురస్కారాలు, షీల్డులతో రఘునాథరావు

మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

విద్యార్థులకు వ్యక్తి గత శుభ్రతపై అవగాహన కల్పిస్తారు. పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకునేలా వారికి వివరిస్తారు. అలాగే వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం నిషేదంపై ఎప్పటికప్పుడు విద్యార్థులకు వివరిస్తారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనేలా వారిని చైతన్య పరచటం ఆయన సహజశైలికి నిదర్శనం.

సాహితీలోకంలో తనదైన ముద్ర

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పటికీ సాహిత్యంపై రఘునాధరావుకు మక్కువ ఎక్కువ. అందుకు ఆయన విద్యార్థులను బాలల రేడియో కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసేవారు. 2015 జనవరిలో తన స్వీయ రచన, దర్శకత్వంలో 'పరివర్తన' నాటిక, 2016లో 'మార్పు' నాటికల్లో పాల్గొనేలా చేశారు. అవి రేడియోలో ప్రసారం కావటం ఆయన రచనా శైలికి నిదర్శనంగా చెప్పవచ్చు.

రఘునాధరావు అందుకున్న పురస్కారాలు

ఉపాధ్యాయునిగా ఎంతో అంకిత భావంతో పనిచేస్తున్న రఘునాధరావు 2015లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే 2017లో అప్పటి విద్యాశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. అంతే కాకుండా గుఱ్ఱం జాషువా కళాపరిషత్ నుంచి సాహితీ విద్యారత్న పురస్కారాన్ని దక్కించుకున్నారు. త్వరలో పదవీవిరమణ చేయనున్న రఘునాధరావు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆశిద్దాం.



గ్రంథాలయ వారోత్సవాల్లో పురస్కారాన్ని అందుకుంటున్న రఘునాథరావు

మార్గదర్శి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

నేడు ఉపాధ్యాయుల దినోత్సవం

భావితరానికి పునాది వేసే భవిత శిల్పులు ఉపాధ్యాయులు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగడంలో కీలకపాత్ర పోషిస్తారు. ఉపాధ్యాయుల బోధనావిధానం, విద్యార్థులను మలిచేతీరు వారి భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. వ్యక్తిత్వ వికాసంతో బాలల్లో మానవతా విలువలు పెంపొందించేందుకు బోధనా విధానమే కీలకం. అందుకే భారతదేశంలో గురువును సాక్షాత్తూ దేవుళ్లతో పోల్చి పూజించారు. విద్యా ర్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులను వెలిగించే గురువులకు మనదేశంలో ప్రత్యేక స్థా నాన్ని కల్పించారు. దానిలో భాగమే సెప్టెంబర్ 5న జరుపుకొనే ఉపాధ్యాయ దినోత్సవం.

'దేశాన్ని తీర్చిదిద్దే మేధావులు ఉపాధ్యాయులే' అని నమ్మే మంచి ఉపాధ్యాయులు, గొప్ప తత్వవేత్త, రాజకీయ నాయకుడు అయిన 'భారతరత్న' సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నేడు. ఆయన స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి. మద్రాస్ ప్రెసిడెన్సీలోని తిరుత్తణిలో సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు సెప్టెంబర్ 5, 1888న రాధాకృష్ణన్ జన్మించారు. అతిసాధారణ బ్రాహ్మణ కుటుంబం. తండ్రి ఓ జమిందారు వద్ద చిన్న ఉద్యోగం. తిరుత్తణిలోని ప్రైమరీ బోర్డు హైస్కూల్‌లో 1893లో ప్రాథమిక విద్య ప్రారంభమ య్యింది. పేద కుటుంబం కావడం వలన విద్యాభ్యాసం చాలావరకు ఉపకారవేతనాలపైనే కొనసాగింది. ప్రాథమిక విద్య ముగియగానే తిరుపతిలోని హెర్మన్స్‌బర్గ్ ఎవాంజెలికల్ లూథరన్ మిషన్ స్కూల్‌లో ఉన్నతవిద్య కొనసాగింది. అనంతరం మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసారు. 21 సంవత్సరాల వయస్సులోనే మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో వేదాంత శాఖలో అసిస్టెంట్ లెక్చరర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే ఆయన భారతీయ తత్త్వశాస్త్రాలపై ఎన్నో రచనలు చేసారు. ఆయా రచనలు ఎందరినో ప్రభావితం చేసాయి. తత్వశాస్త్రంలో ఆయన ప్రతిభను గుర్తించిన మైసూరు విశ్వవిద్యాలయంవారు తమ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా నియమించారు. తర్వాత రవీంద్రనాథ్ ఠాగూర్ కోరిక మేరకు కలకత్తా విశ్వవిద్యాల యంలో ఆచార్య పదవిని చేపట్టాలని నిశ్చయించుకొన్నారు. తమ అధ్యాపకునికి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన విద్యార్థులు రైల్వేస్టేషన్ దాకా రాధాకృష్ణన్‌ను జట్కాబండిపై ఎక్కించుకొని స్వయంగా బండిని లాక్కొని వెళ్ళిన సంఘటన విద్యార్థులకు తమ గురువు రాధాకృష్ణన్‌పై గల ప్రేమ, గౌరవాన్ని తెలియజేస్తుంది. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా ఉన్నప్పుడు 'భారతీయ తత్వశాస్త్రం' అనే గ్రంథాన్ని రచించారు. ఇది అనేకమంది విదేశీ పండితుల ప్రశంసలు పొందింది. "మీరు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ తీసుకుంటే మీకు మరింత గొప్ప పేరొచ్చేది" అని ఒక మిత్రుడు అంటే, బదులుగా డాక్టర్ సర్వేపల్లి "నేను ఆక్షఫర్డ్‌కు వెళ్ళితే అధ్యాపకుడిగానే వెళతాను, విద్యార్థిగా వెళ్లను" అని అన్నారు. అంతటి దేశభక్తి, స్వదేశీ విశ్వవిద్యాలయాల పట్ల అంత గౌరవం, ఆత్మాభిమానం. అలా అన్న ఆరేళ్ల తర్వాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటి వారి ఆహ్వానంపై తత్వ శాస్త్రంపై ఉపన్యాసాలిచ్చేం దుకు వెళ్ళారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికా దేశాలలో ఉపన్యాసాలిచ్చి మాతృదేశానికి పేరుతెచ్చారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆంధ్రా యూనివర్సిటి వైస్‌ఛాన్సలర్‌గా 1931 నుంచి 1936 వరకూ పనిచేశారు. 1939లో పండిట్ మదన్ మోహన్ మాలవ్య కోరిక మేరకు బనారస్ హిందూ యూని వర్సిటి ఛాన్సలర్‌గా 1948 సంవత్సరం జనవరి వరకూ పని చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ సర్వేపల్లి యునెస్కో ప్రతినిధిగా 1952 వరకూ పనిచేశారు. 1952లో భారతదేశ ప్రథమ ఉపరాష్ట్రపతిగా, తర్వాత దేశ రెండవ రాష్ట్రపతిగా 1962 నుంచి 1967 వరకూ పని చేసి మంచి రాజనీతిజ్ఞుడిగా పేరు పొందారు.



1962 సంవత్సరంలో కొందరు మిత్రులు డాక్టర్ సర్వేపల్లి పుట్టినరోజు జరపడానికి ఆయన దగ్గరకు వచ్చిపుడు ఆయన దానిని సున్నితంగా తిరస్కరిస్తూ 'నా పుట్టిన రోజు వేరుగా జరిపే బదులు దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరిపితే నేను ఎంతో గర్విస్తానని' చెప్పి ఉపాధ్యాయ వృత్తిపట్ల తన ప్రేమను చాటారు. 1962 నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన సర్వేపల్లి జన్మదినాన్ని ప్రభుత్వం అధికారికంగా భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 'గురుపూజోత్సవం' పేరుతో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిం చడం సంప్రదాయంగా మారింది.

భారతీయ తత్వశాస్త్రాన్ని ఆంగ్లంలో విదేశాలకు పరిచయం చేసిన గొప్పవ్యక్తి డాక్టర్ సర్వేపల్లి. పుస్తకాలు కొనే ఖర్చు భరించలేక, ఉచితంగా లభించిన పుస్తకాలకు అనువుగా డిగ్రీలో తత్వ శాస్త్రాన్ని ఎంచుకొన్న ఆయన, అందులోనే అంతర్జాతీయ ఖ్యాతి పొందే రచనలు చేయడం విశేషం. కేవలం 20 ఏళ్ల వయసులో ఎంఎ డిగ్రీకోసం ఆయన రాసిన పరిశోధనాత్మక వ్యాసం "ది ఎథిక్స్ ఆఫ్ ద వేదాంత అండ్ ఇట్స్ మెటాఫిజికల్ ప్రిసపోజిషన్స్" పుస్తకంగా వెలువడింది. మైసూరు విశ్వవిద్యా లయంలో ఉండగా తొలి పుస్తకం 'ద ఫిలాసఫీ ఆఫ్ రవీంద్రనాధ్ ఠాగూర్' రాశారు. దేశీయ, అంతర్జాతీయ పత్రికలల్లో ఎన్నో వ్యాసాలు రాశారు. మనదేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న'తో సహా ప్రతిష్టాత్మకమైన 'నైట్‌హుడ్', 'ఆర్డర్ ఆఫ్ మెరిట్', 'జర్మన్ పీస్‌ప్రైజ్', 'టెంపుల్‌టన్ ప్రైజ్' వంటి అవార్డులు ఎన్నో అందుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటిలో డాక్టర్ సర్వేపల్లి పేరిట ఉపకారవేతనాన్ని ఇప్పటికీ ఇస్తున్నారు. మానవ జీవితంలో మంచిని పెంచాలని, ఉత్తమ సమాజాన్ని రూపొందించాలని, మతాన్ని సరిగా అర్థం చేసుకోవాలని బోధించారు. యావత్ ప్రపం చంలో ఏ శాస్త్రజ్ఞునికీ, ఏ మహామేధావికి, ఏ తత్వవేత్తకు, ఏ రాజనీతిజ్ఞునికీ దక్కని అరుదైన గౌరవం సర్వేపల్లికి దక్కింది. ప్రపంచ దేశాలలో ప్రసిద్ధిచెందిన 152 విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం ఆయన ప్రజ్ఞాప్రతిభా విశేషాలకు ప్రతీకలు. పార్లమెంటేరియన్‌గా, దేశాధ్యక్షునిగా తనదైన ముద్రవేశారు. అవస రమైనప్పుడు ప్రభుత్వ విధానాలను అతి నిశి తంగా, తీవ్రంగా విమర్శించడంలో వెను కాడలేదు. పేరుకుపోతున్న అవినీతిని, జాతీయ వనరుల దుర్వినియోగాన్ని అభిశంసించారు. 1967 లో పదవీ విరమణచేసి శేష జీవితాన్ని మద్రాస్‌లో గడిపారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1975 ఏప్రిల్ 17న తుదిశ్వాస విడిచారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాం

అదే స్థాయిలో ఉత్తీర్ణత శాతం పెరిగింది

ఎస్ రాజ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని (ఇన్‌ఛార్జి), డి ఇందిరా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల తెనాలి.

ప్రజాశక్తి తెనాలి



ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా, పదోతరగతి పరీక్షలలో ఉత్తీర్ణత శాతం కూడా పెరిగింది. ఈ ఏడాది పాఠశాలలో మొత్తం 850 విద్యార్థులు ఉండగా వారిలో 180 మంది టెన్త్ విద్యార్థులే. ముఖ్యంగా ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కింద జిల్లాలో 25 పాఠశాలలు ఎంపికైతే వాటిలో మా పాఠశాల కూడా ఉండడం సంతోషం. గత సంవత్సరం కంటే అదనంగా 220 మంది విద్యార్థులను కొత్తగా చేర్చుకున్నాం. టెన్త్ పరీక్షల్లో అత్యధికంగా 85 శాతం ఉత్తీర్ణత సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచాం. పాఠశాలకు విద్యార్థులు గైర్హాజరైతే ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందించటం, క్రమంగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం ఇంచుమించు పూర్తయ్యింది. రూ 25 లక్షలు నిధులతో నూతన డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. నూతన ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం ద్వారా నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం. క్రీడలను ప్రోత్సహిస్తున్నాం. కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. ఈ సంవత్సరం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం టెన్త్ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

వరద బాధితుల కోసం సిపిఎం విరాళాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

విజయవాడ వరద భాదితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం విరాళాల సేకరించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లడుతూ విజయవాడలో వరదల కారణంగా ఎంతో మంది నిరాశ్రయులయ్యారని, వారిని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదోకోవాలని కోరారు. వరద భీభత్సంలో ఎక్కువగా పేదలే నష్టపోయారని, కనీసం కూడ గూడు లేకుండా వేలాది మంది నిరాశ్రయులయ్యారని చెప్పారు. వీరిని ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, నాయకులు బి.నాగేశ్వరావు, షేక్ బాబు, జి.గోవింద్, కోటిరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

పెదమద్దూరు బ్రిడ్జి పనులు చేయించాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి

ప్రమాదకరంగా ఉన్న పెదమద్దూరు బ్రిడ్జి పటిష్టతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు కోరారు. బ్రిడ్జిని, సమీపంలో ముంపుబారిన పొలాలను సిపిఎం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం నిర్మితమైన మద్దూరు బ్రిడ్జి ప్రమాద స్థాయికి చేరిందని అన్నారు. భారీ వర్షాలు వరద నీరు బ్రిడ్జి పై నుండి పారుతోందని ఈ బ్రిడ్జి పై నుండే వివిజయవాడ వరకు నిత్యం రాకపోకలకు సాగుతుందటాయని చెప్పారు. రాజధానికి దగ్గరగానూ ఉంటుందన్నారు. బ్రిడ్జికి పలుమార్లు తాత్కాలిక మరమ్మతులతో వదిలేస్తున్నారని చెప్పారు. 1996లో మద్దూరులో బహిరంగ సభ నిర్వహించగా సిఎం హోదాలో పాల్గొన్న చంద్రబాబుకు నాడు స్థానికులు సమస్యను వివరించగా రూ.కోటి కేటాయిస్తున్నట్లు చంద్రబాబు చెప్పినా కేటాయించలేదని విమర్శించారు. 2008లో నరుకుళ్లపాడు వాగులో లారీ మునగటం వల్ల 28 మంది చనిపోయిన నేపథ్యంలో అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి నరుకుళ్లపాడు, ఎండ్రాయి, పెదమద్దూరు బ్రిడ్జిలు నిర్మాణం కోసం నిధులు కేటాయించారని, నరుకుళ్లపాడు, ఎండ్రాయి బ్రిడ్జీలు నిర్మితమైనందున గుంటూరు-అమరావతి రాకపోకలు ఇబ్బందులు లేకుండా ఉందని చెప్పారు. అయితే మద్దూరు బ్రిడ్జి ప్రభుత్వాలు మారుతున్నా పూర్తి కావడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా పనులు చేపట్టాలని కోరారు. ఇదిలా ఉండగా వాగు సమీపంలోని పత్తి, మినుము పొలాలన్నీ ముంపుబారిన పడ్డాయని, రైతులు ఇప్పటికే రూ.15 వేలు పెట్టుబడి పెట్టారని, కౌలురైతులు మరింతగా నష్టపోయారని చెప్పారు. సత్వరమే పంట నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం ఇవ్వాలని కోరారు. పరిశీలనలో డి.ప్రసాద్, మొహిద్దీన్‌వలి, బి.పౌలు పాల్గొన్నారు.

100 వాహనాలు సీజ్

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలో బుధవారం రాత్రి పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.ప్రధాన రహదారుల్లో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి పలు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టణ సిఐ శోభన్‌బాబు మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య పరిష్కార చర్యల్లో భాగంగా పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. నరసరావుపేట నుండి 10 మంది ఎస్‌ఐలు, ప్రత్యేక పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేసామన్నారు. రోడ్డు మార్జిన్ వద్ద ట్రాఫిక్ అంతరాయం కలిగించి, ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ధ్రువపత్రాలున్న వాహనాలను ఇచ్చేశామని, లేని వాహనాలు 100కు పైగా సీజ్ చేశామని చెప్పారు.



సాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్ల మూసివేత

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎగువన కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి వరద ప్రవాహం తగ్గడంతో బుధవారం నాగార్జునసాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్లను మూసివేశారు. బుధవారం ఉదయం 6 గంటలకు 26 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగింది. 9 గంటలకు ఒక్కసారిగా వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో క్రమేపీ గేట్లను తగ్గించుకుంటు పూర్తిగా మూసివేశారు. శ్రీశైలం జలాశయం నుండి 39,694 క్యూసెక్కుల వరద నీరు సాగర్ జలాశయానికి కొనసాగుతోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 586.80 అడుగులవద్ద నీరు నిల్వ వుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 304.4680 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,516 క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 7778 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, లోలెవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తంగా 39,694 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

నదీపరివాహక ప్రాంతాల్లో డిపిఒ పరిశీలన


ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కృష్ణానదికి ఎగువ నుండి భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో మండలంలోని నది ఒడ్డునున్న ఏకోనామ్‌పేట, విజయపురిసౌత్ గ్రామాలను డిపిఒ బుధవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు చెందిన అధికారులతో ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్షించారు. నది ఒడ్డున ఉన్న ప్రజలను అప్రమత్తం చేయటం, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని చెప్పారు. తుపాను ప్రభావం వలన వర్షాలు పడే అవకాశం ఉన్నందున పాత భవనాల్లోని వారి వివరాలు సేకరించి, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఎంపిడిఓలు సరోజినిదేవి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీచర్ వెళ్లగానే పెచ్చులూడిన పైకప్పు

ప్రజాశక్తి - వినుకొండ



పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో తరగతిగది పైకప్పు ఊడి పడి త్రుటిలో ప్రమాదం తప్పింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వం అధికారికంగా సోమ, మంగళవారం ప్రభుత్వం స్కూళ్ళకి సెలవులు ప్రకటించింది. తిరిగి బుధవారం స్కూల్లో ప్రారంభమయ్యాయి. బాలుర హైస్కూల్లో మొదటి అంతస్తుల 9వ తరగతి బి సెక్షన్ తరగతి గదిలో యథావిధిగా క్లాసులు ప్రారంభమయ్యాయి. సోషల్ టీచర్ సౌజన్య క్లాసు 12:30 ముగియటంతో టీచర్ బయటకు వెళ్లడం, రెండు నిమిషాలు తేడాతో విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనానికి బయటికి వచ్చారు. ఆ వెంటనే తరగతిగది పై కప్పు అచ్చు ఊడి పడడంతో తరగతి గదిలో ఫ్యాన్‌లు విరిగాయి. ఇదే ఘటన రెండు నిమిషాల ముందు జరిగి ఉంటే సోషల్ టీచర్ సౌజన్యకు ప్రమాదం వాటిల్లేదని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎంఇఒ జఫ్రుల్లాకు సమాచారం ఇచ్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. హైస్కూలు 1945లో నిర్మితమైంది. ఆ భవనం చెక్కుచెదరకుండా ఉంది. 15 ఏళ్ల క్రితం అదనపు తరగతి గదుల కోసం సర్వ శిక్ష అభియాన్‌లో నిర్మించిన మొదటి అంతస్తు తరగతి గదుల గోడలు బీటలు వారడం, పై కప్పులు పడిపోవడం గమనార్హం.



ఇళ్లను కూలుస్తున్న పొక్లెయినర్

కొనసాగుతున్న ఇళ్ల కూల్చివేతలు

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల కేంద్రమైన అచ్చంపేటలోని చామర్రు రోడ్డులో పేదల ఇళ్ల కూల్చివేతలు బుధవారమూ కొనసాగుతూనే ఉన్నాయి. రెవెన్యూ, పోలీస్, ప్రత్యేక బలగాలతో పోలీసులు మోహరించారు. తొలుత ఇళ్లకు విద్యుత్ వైర్లు తొలగించారు. అనంతరం మూడు పొక్లెయినర్లతో కూల్చివేత చేపట్టారు. మంగళవారం పాక్షికంగా పడగొట్టిన రెంటపాళ్ల పుల్లమ్మ ఇల్లు బుధవారం పూర్తిగా కూల్చేస్తుండడంతో ఆమె రెవెన్యూ అధికారులు వేడుకుంటూ సొమ్మసిల్లి పడిపోయారు. ఆమెను మహిళా పోలీసులు వైద్యశాలకు తరలించారు. షేక్ ఖాసింకు చెందిన పూరింటిని నేలమట్టం చేశారు. అక్కడికి చేరుకున్న వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులని, 11 దారులు మాత్రమే బాగు చేస్తున్నమని చెబుతూ ఇళ్లను కూల్చడం ఏమిటని అధికారులను నిలదీశారు. పోలీసులను మొహరించి ఇష్టానుసారంగా అధికారులు ప్రవర్తిస్తున్నారని, ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు మండిపడ్డారు. కూల్చివేతలను ఆపకుంటే ఆందోళనకు పూనుకుంటామన్నారు.

హత్యాయత్నం కేసులో వైసిపి నాయకులు ఆరెస్టు

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికలకు ముందు స్థానిక జెండా చెట్టు వద్ద టిడిపి నాయకులపై దాడి చేసిన కేసులో నిందితులుగా 10 మంది వైసిపి వారిని అరెస్టు చేశారు. ఎన్నికలకు ముందు టిడిపి నాయకులు ప్రచారం చేస్తున్న సందర్భంలో వైసిపి నాయకులు అడ్డు తగిలి దాడి చేశారని టిడిపి నాయకులు కేసులు పెట్టారు. దీనిపై దాడి సమయంలోనే ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా వారి ఫిర్యాదును పోలీసులు తీసుకోలేదు. దీంతో వారు కోర్టును ఆశ్రయించగా, కోర్టు నుండి వచ్చిన ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తాజాగా 10 మందిని ఆరెస్టు చేసి బుధవారం స్థానిక కోర్టులో హాజరుపర్చారు.



వేలూరు-చిలకలూరిపేట మధ్య చప్టాపై నీరు

వానొస్తే నిలుస్తున్న రాకపోకలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వేలూరు-చిలకలూరిపేట, కోమటినేనివారిపాలెం-గోవిందపురం, గోవిందపురం-కమ్మవారిపాలెం, ఎడవల్లి-చిలకలూరిపేట, చిలకలూరిపేట-గణపవరం గ్రామాల మధ్యలో ఉన్న చప్టాలను బ్రిడ్జీలుగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. కొద్దిపాటి వానలొచ్చిన చప్టాలపై నీరు ప్రవహిస్తూ ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు. దీనివల్ల తాము కూలి పనులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. నక్క వాగుకు నీరు అధికంగా వస్తే వేలూరు, గోవిందపురం వద్ద చప్టాపైకి నీరొస్తుంది. వాగు ఉధృతితో గతంలో పలువురు ప్రాణాలూ కోల్పోయారు. అయినా హెచ్చరిక బోర్డులేమీ పెట్టడం లేదు.

విద్యావ్యవస్థలో దిజారుతున్న ప్రమాణాలు

- చేష్టలుడిగి చూస్తున్న ప్రభుత్వం.. ప్రక్షాళన దిశగా చర్చించటం అనివార్యం
- జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్



ప్రజాశక్తి-తెనాలి

విద్యా వ్యవస్థపై మేధావులు అత్యవసరంగా అలోచన చేయాల్సిన అవసరం ఉందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 'మన విద్యావిధానం-అవగాహన' అనే అంశంపై ఆయన ఏమన్నారంటే...ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి రోజురోజుకూ అగమ్యగోచరంగా మారుతోంది. సంస్కరణల పేరిట ఎటు తీసుకుపోతున్నారో కూడా అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ప్రభుత్వ కళాశాలల పరిస్థితి చూస్తే అందుకు మినహాయింపేమీ కాదు. ఇంటర్మీడియట్ ఎంపిసి ప్రభుత్వ కళాశాలల్లో చదివితే ఐఐటిలో సీటు వస్తుందా? అంటే రాదనే సమాధానమే వస్తుంది. గతంలో అంటే 30 ఏళ్లకు పూర్వం అంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివినవారే. డాక్టర్, ఇంజనీర్, లాయర్, ప్రొఫెసర్, సైంటిస్ట్, టీచర్, రాజకీయంగా అగ్రనాయకులుగా ఎదిగిన వారికి కూడా ప్రభుత్వ పాఠశాలలే దిక్కు.. తరగతి గదులు విద్యార్థులతో కళకళలాడేవి. అంతా తెలుగు మీడియంలోనే బోధన కూడా ఉండేది. ఇప్పుడు ఆ సామర్థ్యం ఏమైందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. మరోవైపు ప్రాథమిక విద్య ముగిసిన వారికి ఉన్నత పాఠశాలలు అందుబాటులో లేకపోవటం, పదోతరగతి పూర్తి చేసిన వారికి ఇంటర్ విద్య అందుబాటులో లేకపోవటంతో చదువు మానేసిని పరిస్థితులూ ఉండేవి. అక్కడక్కడా అందుబాటులో ఉన్న కళాశాలల్లో పరిమితంగానే సీట్లు ఉండేవి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో పుట్టుకొచ్చినదే కార్పొరేట్ విద్యావ్యవస్థ. ప్రభుత్వ కళాశాలల్లో సీటు దక్కనివారు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించే వారు. అయితే సీట్లు దక్కని వారిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కళాశాలలను పెంచాల్సి ఉన్నా ఆ పని ప్రభుత్వం చేయలేకపోయింది. దీంతో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేశాయి. కనీసం తరగతి గది ప్రమాణాలు, విద్యాసంస్థల్లో ఉండాల్సిన క్రీడా ప్రాంగణాలకు సైతం తిలోదకాలిచ్చి, అపార్ట్‌మెంట్లలో విద్యాసంస్థలను నిర్వహించే స్థితికి చేరాయి. విద్యా ప్రమాణాలు మంటగలుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకునే తీరిక లేకుండా వ్యవహరిస్తున్నాయి.

మాతృభాషకు తిలోదకాలు-ఆంగ్ల మాధ్యమానికే పెద్దపీట

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులను ఆకర్షించేందుకు ఇంగ్లీష్ మీడియం స్కూల్స్, కాన్వెంట్స్ ఇంగ్లీష్ మీడియం బోధన అంటూ విద్యను వ్యాపారం చేశాయి. చదువు వచ్చినా, రాకున్నా ఇంగ్లీష్ మీడియంలో చదవకుంటే జీవితమే వ్యర్థమన్న భావన కల్పించేశారు. చివరకు మాతృ భాషలోనే విద్యాబోధన జరగాలన్న నిబంధనున్నా తిలోదకాలిస్తున్నా అధికారుల్లో చలనం లేదు. దీంతో ప్రైవేటు పాఠశా లల మోజులో పడిన తల్లిదండ్రులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినా ప్రైవేటు పాఠశాలలకే మొగ్గుచూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు కుదేలయ్యాయన్నారు. దీనికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులపై పనిభారం పెంచేసి, సంబంధం లేని పనులకు పురమాయిస్తూ విద్యావ్యవస్థనే దిగజార్చే శారు. ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టినా అందుకు సామర్థ్యం కలిగిన ఉపాధ్యాయులను నియమించలేకపోవటం, ఉపాధ్యాయుల కొరత, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవటం వంటి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే వ్యవస్థను దిగజార్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యావ్యవస్థ ప్రక్షాళనకు నడుం బిగించాలని, కచ్చితమైన సంస్కరణలకు మేధావులతో చర్చించాల్సిన అవసరం ఉంది..' అని ఉమామహేశ్వర్ స్పష్టం చేశారు.

ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేకం

పేదల పిల్లలకు
ప్రభుత్వ పాఠశాలలే దేవాలయాలు

ప్రజాశక్తి - మాచర్ల

పేద, మధ్యతరగతి పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేస్తూ, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ప్రభుత్వ పాఠశాలలే నిజమైన దేవాలయాలు అని ఉపాధ్యాయ దంపతులు తూబాటి సత్యనారాయణ, ఐవి నాగమణి అంటున్నారు. దశాబ్దాల పాటు ప్రభుత్వ విద్యారంగంలో అనుభవం కలిగిన వీరు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు. తూబాటి సత్యనారాయణ తెలుగు పండిట్‌గా మూడు దశాబ్దాలపాటు పనిచేసి రిటైర్ అయ్యారు. నాగమణి మాచర్ల మండలం కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. 16 ఏళ్ల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయినిగా, 2005 నుండి హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. ఇప్పటికే నాగమణి మూడున్నర దశాబ్దాల ఉపాధ్యాయ వృత్తిలో ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఎన్నోసార్లు ఉత్తమ ఉపధ్యాయురాలిగా సన్మానాలు పొందారు. ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆసక్తి వల్ల మండల విద్యాశాఖాధికారి పదవులను సైతం తిరస్కరించారు. పల్నాడు ప్రాంతంలో అంకితభావం కలిగిన ఉపాధ్యాయురాలిగా మంచి పేరు సంపాదించారు. వారిరువురు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ... ప్రాథమిక విద్యాబోధనలో మాతృ భాష ఎంతో అవసరమన్నారు. పట్టణ ప్రాంతాలతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, వారి విద్యా వికాశానికి మాతృభాష కచ్చితంగా అవసరమని చెప్పారు. ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు ఆంగ్లభాష అవసరమే అయినా మాతృభాషతో కలిపి ఆ బోధన ఉంటేనే సత్ఫలితాలు ఉంటాయని వివరించారు. గతంతో పోల్చితే గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల్లో సైతం పిల్లల చదువు పట్ల అవగాహన పెరిగిందని, బడికి పంపేందుకు తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారని తెలిపారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులు తల్లితండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. ఎటువంటి విద్య అవసరం అనే దానిపై ప్రభుత్వాలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు కూడా పిల్లల తల్లిదండ్రులను చైతన్య పరచాలని సూచించారు. నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో చేరినది మొదట కొప్పునూరు పాఠశాలలలోనే అన్నారు. 12 ఏళ్లు ఇక్కడ పనిచేశానని, తర్వాత మరో 12 ఏళ్ల పాటు హెచ్‌ఎంగా మాచర్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పనిచేశానన్నారు. తిరిగి ఏడాది నుండి కొప్పునూరు పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నానని, తన ఉపాధ్యాయ జీవితం ఎంతో సంతృప్తికరంగా ఉందని తెలిపారు.



ఉపాధ్యాయ దంపతులు సత్యనారాయణ, నాగమణి

ఉత్తమ పాఠశాలగా ప్రథమ స్థానంలో నిలపాలన్నదే లక్ష్యం

మౌలాబి, ప్రధానోపాధ్యాయిని, ఎస్ఆర్ఎస్ఎంబి హైస్కూల్, తెనాలి.



ఉత్తమ పాఠశాలగా ప్రథమ స్థానంలో నిలవాలన్న లక్ష్యంతో అన్ని విధాలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ప్రత్యేక తరగతులతో పాటు 10వ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామని, ఎన్‌సిసి 22(ఎ) బెటాలియన్ తో పాటు ఈ ఏడాది స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతనంగా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. నూరేళ్ల చరిత్ర కలిగిన సభావేదిక నాగ కళామందిర్‌ను దాతలు శేషుబాబు సహకారంతో అభివృద్ధి చేశామని, సభా వేదికపై పాఠశాల చిత్రలేఖనోపాధ్యాయులు రవీంద్ర విజయ ప్రకాష్ చిత్రీకరించిన అశోక ధర్మచక్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని చెప్పారు. గతేడాది 582 మార్కులతో జి.హర్ష వర్ధన్ తెనాలిలో ప్రథమ స్థానంలో నిలిచాడని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ప్రణాళికాబద్ధమైన విద్యను అందిస్తున్నామని అన్నారు.

గురువు గొప్పతనం

అక్షరాలు దిద్దుస్తున్నప్పుడు
తెలియలేదు..
నా జీవితాన్ని మలుపు
తిప్పుతున్నారని.
కోపగించుకున్నా తెలియలేదు..
నాపై బాధ్యతను పెంచుతున్నారని.
చేతిమీద కొట్టినప్పుడు తెలియలేదు..
నా చేతికి పదును పెడుతున్నారని.
ప్రశ్నలడిగినప్పుడు తెలియలేదు..
ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారని.
పరీక్ష పెడుతున్నప్పుడు తెలియలేదు..
నా ఆత్మ విశ్వాసాన్ని పరీక్షిస్తున్నారని.
మార్కులిస్తున్నప్పుడు తెలియలేదు..
నాలో సామార్థ్యాన్ని నింపుతున్నారని.
ఈ క్షణం తెలుస్తోంది నాలో..
ఒక విశాల ప్రపంచాన్ని
సృష్టిస్తున్నారని.
ఒక మహాశక్తిగా మలచారని.
కాలం వెనక్కివెళితే..
మీతో మళ్లీ... దెబ్బలు తింటా..
అనురాగానికి పాత్రులవుతాం..

షేక్ హుస్సేన్, డైరెక్టర్, గీతాంజలి స్కూల్, గుంటూరు.



ఉపాధ్యాయులూ కేంద్ర స్థానంలో ఉండాలి

బి.స్వప్న, బయాలజీ టీచర్, సుమేధ హైస్కూల్, ఎన్‌జిఒ కాలని, గుంటూరు.



సమాజంలో మార్పుల కారణంగా ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థితో పాటు ఉపాధ్యాయులు కూడా కేంద్ర స్థానంలో ఉండాలి. విద్యార్థి వ్యక్తిగత, మానసిక స్థాయిలో మార్పులకు అనుగుణంగా పటిష్టమైన బోధనాభ్యసనను చేపట్టాలి. అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో అభిరుచిని పెంపొందింప చేసి చదువు పట్ల ఆసక్తిని పెంచే ప్రయోగాలను, అవగాహనా తరగతులు ఏర్పాటు చేయాలి. జీవితంలో ఎదుర్కోబోయే సమస్యలను తేలిగ్గా అధిగమించేందుకు వీలుగా ఆధునిక విద్యను ప్రోత్సహించాలి. కనిష్ట సామర్థ్యాన్ని గరిష్ట స్థాయికి పెంచి వారిలో మానసిక ధైర్యాన్ని పెంపొందించాలి. ప్రతిభావంతులను దేశానికి అందించడం ప్రస్తుత ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యం. కారణ, కారకాలను విశ్లేషించి, భేదాలను సరిపోల్చి, వ్యక్తిగత క్రమ శిక్షణతో పాటు, వ్యక్తిగత విలువలను కూడా విద్యార్థుల్లో వృద్ధి చేయాలి. మెరుగైన సమాజ నిర్మాణం విద్యాలయం మాత్రమే సాధించగలదు.

ఉపాధ్యాయ వృత్తే దైవం..పాఠశాలే దేవాలయం

పి.సౌజన్య, ప్రధానోపాధ్యాయిని, ఆది ఆంధ్ర మున్సిపల్ ఎల్.ఇ స్కూల్, హయ్యర్‌పేట.

ప్రజాశక్తి-తెనాలి



ఉపాధ్యాయ వృత్తిని దైవంగా, పాఠశాలను దేవాలయంగా భావిస్తాను. ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చిన నేపథ్యంలో వృత్తిని గౌరవించటం నా నైజం. ఎందుకంటే మా తండ్రి పీటా రామచంద్రరావు ఉపాధ్యాయులు. ఎంతో నిబద్ధత కలిగిన వ్యక్తి. ఆయన మాకు ఎంతో స్ఫూర్తిదాయకం. మేము ముగ్గురు సంతానం. నాన్నతో పాటు అమ్మ జానకి కూడా మమ్మల్ని చదువుపై ఎంతగానో ప్రోత్సహించేవారు. 2000 డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం పొందాను. నా భర్త మోర్ల పోతురాజు కూడా ఉపాధాయులే. నా ప్రతి అడుగు వెనుక ఆయన ప్రోత్సాహం ఉంటుంది. ఇప్పటికి 23 ఏళ్లుగా ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నా. మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల చెంచుపేట, ఐతానగర్ జెవిఆర్ఎస్ఎంఇ పాఠశాల, మున్సిపల్ ఎలిమెంటర్ స్కూల్ కొత్తపేట, ఇందిరానగర్ కాలనీ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేశారు. ప్రస్తుతం ఆది ఆంధ్ర మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ఐతానగర్‌లో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నాను. నేను కొత్తపేట మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ (వాణి విద్యాలయంలో) పనిచేస్తున్న సమయంలో విద్యార్థులు లేక మూతపడిన ఐతానగర్ ఆది ఆంధ్ర మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను అప్పటి కమిషనర్ కె.శకుంతల, మరికొంతమంది పెద్దల సహకారంతో తెరిపించగలిగాను. 45 మంది విద్యార్థులను పాఠశాల్లో చేర్పించి, పాఠశాలను నందనవనంగా తీర్చిదిద్దాను. అప్పటి ఎమ్మెల్యే ద్వారా రెండుసార్లు స్వచ్ఛ విద్యాలయ పురస్కారం కూడా అందుకున్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాను. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా బోధనా పద్ధతులను పాటిస్తూ, విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. అంతే కాకుండా సామాజిక బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

పాఠశాలలో సదుపాయాల కొరత లేదు

రాజారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, కెఎస్ఎం హైస్కూల్, తెనాలి

ప్రజాశక్తి - తెనాలి



పాఠశాలలో మొదలుపెట్టిన అదనపు భవన నిర్మాణం పూర్తయింది. విద్యార్థుల కోసం ఏడు నూతన అదనపు తరగతి గదులు నిర్మింపజేశాం. పాఠశాలలో మూత్రశాల, సభా వేదిక మరమ్మతులు పూర్తి చేయించాం. వర్షపు నీరు నిల్వలేకుండా తగిన ఏర్పాట్లు పూర్తిచేసి చుట్టూ ఫెన్సింగ్, ఆకతాయిలు ప్రవేశించకుండా ఇనుప గేట్లను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా సదుపాయం కల్పించాం. పాఠశాలలో గతేడాది 570 మంది విద్యార్థులుండగా 2024లో ఆ సంఖ్య 650కు పెరిగింది. ఎన్‌సిసి కేడెట్లతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మొత్తంగా పాఠశాలలో మౌలిక వసతులకు కొరత లేదు. స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ పేరిట పాఠశాల ఆవరణలో రెండు వేల మొక్కలు నాటించాం. విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరాలు కూడా నిర్వహించాం. ఆరోగ్యరిత్యా నులిపురుగులు నిర్మూలనకు వైద్య సిబ్బంది సహకారంతో ఆల్బెండెజాల్ టాబ్లెట్లను అందజేస్తున్నాం. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులుగా సోషల్ మాస్టారు కొండూరు శ్రీనివాసరావును నియమించాం. స్కూల్ మేనేజ్మెంట్ కమిటి ద్వారా కొలనీడి మేరీని ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడంతో పాటు 24 మంది సభ్యులను ఎంపిక చేశాం. స్కూల్ కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారు. గతేడాది పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ఎస్ రాజేష్, కిరణ్మయిలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశాం. చక్కటి పాఠశాల విధానాన్ని అందించడమే మా లక్ష్యం.



పడిపోయిన మొక్కజొన్న పైరును చూపుతున్న రైతు



అంగలకుదురు పునరావాస కేంద్రంలో నిరాశ్రయులు



2000 భోజనపాకెట్లు సిద్ధం చేస్తున్న మంగళగిరి నాయకులు

వరద ముంపులోనే బాధితులు, రైతులు - సాయం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - కొల్లిపర

చేతికందే వచ్చిన పంట వరద కారణంగా మొక్కజొన్న పంట పూర్తిగా పడిపోయి నష్టం వాటిల్లిందని మండలంలోని అన్నవరపు లంక గ్రామం రైతు బొమ్మ సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి సుమారు రూ.50 వేలు పెట్టుబడి పెట్టానని, రూపాయి కూడా రాని పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బాధితులకు అందించిన సహాయం

మండలంలో వరదముంపునకు గురైన అన్నవరపు లంక బొమ్మువానిపాలెం గ్రామస్తులకు అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ గుంటూరు వారి ఆధ్వర్యంలో పులిహోర, చపాతీలు, బ్రెడ్లు బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు, క్యాండిల్స్, అగ్గిపెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరపున డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు తహాశీల్దార్ సిద్ధార్థ మధు సతీష్, అమ్మా ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ సతీమణి నాదెండ్ల మనోహరం కొల్లిపర మండలంలో హనుమాన్‌పాలెం స్కూలు తూములూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మహిళలకు 300 చీరలు పురుషులకు 150 పంచెలు బియ్యం నిత్యవసర సరుకులు యాపిల్ పండ్లు అందజేశారు.అనంతరం వరద వలన నీట మునిగి దెబ్బతిన్నపసుపు పంటను పరిశీలించారు. ఓఎస్‌డి యేసు రత్నం, జెఎస్‌పి మండల పార్టీ అధ్యక్షులు ఎర్రి వెంకయ్య నాయుడు

అప్పుల పాలయ్యి: వెంకట్‌రెడ్డి (హనుమాన్‌పాలెం రైతు)



'అప్పుచేసి రెండు ఎకరాల దొండతోట సాగు చేశాను. పూత, పిందెదశలో ఉండగా వరద కారణంగా పందిరి కూలిపోయింది. దొండ పాదులు కుళ్ళి పోయే దశకు చేరుకున్నాయి. విత్తనాల కొనుగోలు పందిరి అల్లిక ఇందులో పిచికారికి సుమారు రూ.50 వేలు ఖర్చు అయ్యింది. వరద ముంపు కారణంగా అప్పుల పాలయ్యాను. ప్రభుత్వం ఆదుకుంటుందని అర్థిస్తున్నాను.'

వరదబాధితులకు పునరావాస కేంద్రం సేవలు

ప్రజాశక్తి - తెనాలి

వరద బాధితులకు పునరావాస కేంద్రాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తహాశీల్దార్ కెవి.గోపాలకృష్ణ చెప్పారు. మరో రెండురోజులు ఈకేంద్రాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రూరల్ గ్రామాలు బుర్రిపాలెం, అంగలకుదురులో పునరావాస కేంద్రాలను ఆయన బుధవారం పర్యవేక్షించారు. అక్క ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, బస చేస్తున్న బాధితులకు అందుతున్న భోజన వసతిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బుర్రిపాలెం ఎస్టీ కాలనీ 45 కుటుంబాలకు చెందిన 150 మందికి అక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. అంగలకుదురు గ్రామంలో నిరాశ్రయులకు కూడా స్థానిక పాఠశాలలో ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. తహాశీల్దార్ తో పాటు రెవిన్యూ సిబ్బంది, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం తదితరులున్నారు.

భగీరథ ట్రస్టు ఆధ్వర్యంలో 2000 భోజన ప్యాకెట్లు

ప్రజాశక్తి - మంగళగిరి

విజయవాడలో వరద ముంపునకు గురైన బాధితుల ఆకలి తీర్చడానికి మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి కాలనీ భగీరథ రెస్టారెంట్, గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, భగీరథ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 2000 భోజన పాకెట్లను బుధవారం పంపించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్యలు మాట్లాడుతూ సగర సంఘం, భగీరథ ట్రస్ట్ వారు విజయవాడ ముంపు బాధితులకు భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ పంపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

ప్రజాశక్తి - తాడికొండ

వరద బాధితుల సహాయార్థం బీఎస్పీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శంగారపాటి బాబురావు రూ.5000 వరద బాధితులకు కోసం సమర్పించారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహాశీల్దారు నాసరయ్యకు చెక్కును అందజేశారు. ప్రతి ఒక్కరూ మానవతాదృక్పథంతో ముందుకురావాలని కోరారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు

విజయవాడ వరద నిరాశ్రయులకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిఈఈగా ఎన్.వెంకటేశ్వరరావు రూ.10,116లను ముఖ్యమంత్రి సహాయ నిధికి సమర్పిస్తూ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ కె.గంగాధరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును వీసీ గంగాధరరావు అభినందించారు. కార్యక్రమంలో ఇన్చార్జి రెక్టార్ ప్రొఫెసర్ కె. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి, సూపరింటెండెంట్ భాను ప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో కురిసిన భారీ వర్షాల వలన ముంపునకు గురై జీవనం కోల్పోయిన వరద బాధితులకు బుధవారం సాయంత్రం మంగళగిరి పట్టణంలో నిత్యవసర సరుకులు ప్రభుత్వం పంపిణీ చేసింది. చేనేత కార్మికులకు 50 కేజీలు బియ్యం, ముంపు గురైన ఇతరులకు 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంప, నూనె కేజీ చొప్పున అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ వి అంజన సింహ, కార్పొరేషన్ కమిషనర్ ఆలిం భాష, తాసిల్దార్ షేక్ సుభాని, టిడిపి నాయకులు నందం అబద్దయ్య, కాండ్రు శ్రీనివాసరావు, కె కోమల కుమార్, దామర్ల రాజు, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



నిరాశ్రయులకు అండగా నిలవాలి : ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో వరదముంపునకు గురైన బాధితులకు తమ వంతు సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నసీర్ సౌజన్యంతో గుంటూరు ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విజయవాడ వరద బాధితుల కోసం 14,500 లీటర్ల పాలు, పదివేల భోజన ప్యాకెట్లు, 14 వేల వాటర్ బాటిళ్లు, 5000 బిస్కెట్ ప్యాకెట్లు, కొవ్వొత్తులు, దోమల అగరొత్తులను నింపిన వాహనాలను ఎమ్మెల్యే నసీర్ పచ్చ జెండా ఊపి తరలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 34వ డివిజన్ అధ్యక్షులు సిటీబస్ బాబు, కార్పొరేటర్ పోతురాజు సమత, కొనకళ్ళ సత్యం, జుజ్జురి శేషప్రభాకర్‌రావు, రామకష్ణ, నిరంజన్, రమేష్, తదితరులు



పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు విజయవాడలోని వరద బాధిత ప్రాంతమైన 1వ వార్డులోని ఆదర్శ నగర్, కార్మెల్ నగర్, లెనిన్ నగర్ మొదలైన ప్రాంతాల్లో రెండో రోజు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డితో కలిసి ఎమ్మెల్యే నసీర్ బాధితులకు భోజనం, పాలప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు అందచేశారు.

ఉమేష్‌చంద్ర పనితీరు పోలీస్‌శాఖకే గర్వకారణం

ప్రజాశక్తి - తెనాలి

వృత్తి పట్ల అంకితభావం, నిబద్ధత కలిగిన ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర పోలీసు శాఖకే గర్వ కారణమని డిఎస్పి బి.జనార్ధన రావు అన్నారు. ఉమేష్ చంద్ర వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యులు, సబ్ డివిజనల్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా స్థానిక రావి అమ్మయ్య చౌక్‌లోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథి డిఎస్పీ మాట్లాడుతూ వరంగల్, కడప, పులివెందుల ప్రాంతాలలో ఉమేష్ చంద్ర సమర్ధవంతంగా పనిచేశారన్నారు. తెలంగాణా ప్రాంతంలో నక్సల్స్ ఏరివేతలో ఎంతో చురుకుగా పనిచేశారన్నారు. ఆ కారణంగానే నక్సల్స్ అత్యంత పాశవికంగా ఆయనను హతమార్చారని అన్నారు. రూరల్ సీఐ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న వయసులో ఐపిఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఉమేష్ చంద్ర పోలీస్ శాఖకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో త్రీటౌన్ సిఐ రమేష్ బాబు న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, ఉమేష్ చంద్ర కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

500 మందికి ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి: మంగళవారం రాత్రి మహానాడు వరద బాధితులు 500 మందికి బాధితులకు చినజీయర్ స్వామి ఆహారం పంపిణీ చేశారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మకు బుధవారం రాత్రి చినజీయర్ స్వామి పుష్కర ఘాట్ల వద్ద హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆహోబిల జీయర్‌స్వామి, ఆశ్రమం నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు,



రఘునాథాచార్యులు, శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, శంకరరెడ్డి, ఆశ్రమం నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరద ఉధృతితో పశువులు మృతి

ప్రజాశక్తి - కొల్లిపర



కొల్లిపర మండలం పొట్టి దిబ్బలంక గ్రామానికి చెందిన మొవ్వ గోపి పశువులు (గేద, ఆవు) వరద నీటిలో మునిగి చనిపోయాయి. వాటి విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పశుపోషనే జీవనాధారం కావున పశువులకు నష్టపరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్తమ సేవా అవార్డుకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు మండలం నుండి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు డి.నాగకృష్ణకుమారి, బాలికల హైస్కూల్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్(పిడి) అరిగా పద్మ, చింతలపూడి ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కసుకుర్తి భాస్కరరావులు ఈ అవార్డులకు ఎంపికలో ఉన్నారు. గురువారం గుంటూరులో జరిగే అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ చేతులమీదుగా అవార్డు తీసుకోబోతున్నారు.

కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

హైదరాబాద్ బయోఫోర్ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్.రంగిశెట్టి జగదీశ్ బాబు డాక్టర్. పుల్లగూర్ల మాణిక్ రెడ్డి బుధవారం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుచున్న అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం రూ.లక్ష విరాళంగా కళాశాల సొసైటీ అకౌంట్‌కు పంపించారు. అదేవిధంగా వారు పీఈడి సొసైటీకి ప్రతి సంవత్సరమూ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ జి.వీర రాఘవయ్య తెలిపారు. కళాశాలలోని పేద విద్యార్థుల సహాయార్థం, అభివృద్ధి పనులకు సహాయసహకారాలందిస్తున్న బయోఫోర్ ఫౌండేషన్ వారికీ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు విశ్రాంత విజిలెన్స్ ఏ ఎస్ పి కాళహస్తి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇన్‌ఛార్జి తహాశీల్దారుగా కె.కళ్యాణి

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండల ఇన్‌ఛార్జి తహాశీల్దారుగా కె.కళ్యాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏవోగా ఉద్యోగ విధులు నిర్వహిస్తూ అదనపు బాధ్యతల్లో భాగంగా మేడికొండూరు ఇన్‌ఛార్జి తహాశీల్దారుగా బాధ్యతలు చేపట్టారు.

రేపటి నుండి పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలో వరద ముంపు గ్రామాల్లోని పశు పోషకులను ప్రభుత్వం ఆదుకోవడానికి నేడు, రేపు పశు దానా పంపిణీ చేస్తుందని కొల్లిపర పశు వైద్యాధికారి సాయి సతీష్‌రాజ్ తెలిపారు. ముంపునకు గురైన బొమ్మువాణిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంక గ్రామాలకు ప్రభుత్వం 31 టన్నుల పశుదానా బుధవారం అందజేసింది. వరదల వల్ల నష్టపోయిన పశుపోషకులను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పశుదాన పంపిణీ చేసిందన్నారు. ఒక్కొక్క పశుపోషకునికి 100 కేజీల దానా అందస్తామని తెలపారు. గురువారం, శుక్రవారం ఆయా గ్రామాల్లో పంపిణీ చేస్తామన్నారు.



రెండో ప్రమాద హెచ్చరిక ఎత్తివేత

ప్రజాశక్తి-తాడేపల్లి :ప్రకాశం బ్యారేజీ వద్ద బుధవారం వరద ఉధృతి తగ్గింది. బ్యారేజీ వద్ద ప్రస్తుతం పైనుంచి 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. అదేస్థాయిలో నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో కృష్ణానది వద్ద రెండో ప్రమాద హెచ్చరికను ఎత్తివేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని బ్యారేజీ ఎఇ దినేష్ తెలిపారు. మంగళవారానికి, బుధవారానికి 6.05 లక్షల క్యూసెక్కుల వరద నీరు తగ్గిందని బ్యారేజీ అధికారులు తెలిపారు.

నేటి నుండి పాఠశాలలు పున:ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో వర్షాల కారణంగా ఇబ్బంది ఉన్న పాఠశాలలు, తుపాను బాదితులకు ఆశ్రయం కల్పించిన పాఠశాలలు మినహా, మిగిలిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలయాలలోని పాఠశాలలు నేటి నుండి యధావిధిగా పనిచేస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మాత్రమే విద్యార్ధులను తరగతి గదుల్లోకి అనుమతించాలని అన్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత తనిఖీ అధికారికి తెలియజేయాలన్నారు.





వరద బాధితులకు శ్రీగురుకృష్ణ ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలలో శ్రీగురు కృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తూర్పు కాపు సంఘం సహకారంతో 2500 అహర పొట్లాలను అందచేశారు. బుధవారం ఆహారం తరలించే వాహనాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనోబోయిన శ్రీనివాస్‌యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. గళ్ళా మాధవి, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ శ్రీగురుకృష్ణ ట్రస్ట్, కాపు సంఘం సభ్యుల సేవా భావాన్ని అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు, నగర జనసేన పార్టీ కార్యదర్శి కొత్తకోటి ప్రసాదు, ట్రస్ట్ సభ్యులు నోరి పార్ధసారథి, కాపు సంఘం అధ్యక్షుడు అబోతుల రామారావు, నగర కార్యదర్శి వంజరపు దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





ట్యాపుల ద్వారా కలుషిత నీరు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 4, 17 వార్డుల్లో మున్సిపల్ ట్యాపుల ద్వారా వస్తున్న మంచినీరు బురదతో కూడి కలుషితమవుతుంది. ఒకపక్క వానలు ముంచెత్తి వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. మున్సిపల్ ట్యాపుల ద్వారా వస్తున్న ఈ నీటిని తాగితే అంటురోగాలు ప్రబలుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచినీరు సరఫరా చేసే మెయిన్ లైన్ లీకేజి వల్ల నీరు కలుషితం అవుతుందా అనేది ఇంజనీరింగ్ విభాగం పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. వారం రోజుల నుంచి చెబుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే ఎంటిఎంసి అధికారులు స్పందించి మురికినీటిని అరికట్టి మంచినీరు సరఫరా అయ్యే విధంగా చూడాలని కోరుతున్నారు.





విరాళాల కోసం ప్రత్యేక అకౌంట్

ప్రజాశక్తి-గుంటూరు

వరద బాధితుల కోసం విరాళాలు అందించాలి అనుకునే దాతలు కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ గుంటూరు డిస్ట్రిక్ట్ పేరుతో ఐడిఎఫ్‌సి బ్యాంక్ అకౌంట్ నెం.332609 19895, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఐడిఎఫ్‌సి 0081061 పేరుతో చెక్‌లు, డిడిలు అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అండగా నిలవడానికి విరాళాలు అందించడానికి పలువురు ముందుకు వస్తున్నారని, వారి కోసం ప్రత్యేకంగా బ్యాంకు అకౌంట్ ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే గుంటూరు నగరపాలక సంస్థ కూడా విరాళాలు, వస్తువుల సేకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసిందన్నారు.

జిఎంసి ఆర్ఓ విరాళం..

వరద బాధితుల కోసం జిఎంసి రెవెన్యూ అధికారి రెహ్మాన్ రూ.5 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా రెహ్మాన్‌ను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అభినందించారు. రెహ్మాన్ అందించిన నగదుని సిఎం రిలీఫ్ ఫండ్‌కి జమ చేయడం జరిగిందన్నారు.






ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - అంగలకుదురు
తెనాలి మండలం, గుంటూరుజిల్లా.
నవ సమాజ నిర్మాణానికి కృషి చేసేది ఉపాధ్యాయులే...
విద్యార్థులకు దశ, దిశా నిర్దేశం చేసేది గురువులే... ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు, విద్యాశాఖాధికారులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
ఎన్.అనురాధ
ప్రధానోపాధ్యాయులు
జెడ్‌పిహెచ్‌ఎస్- అంగలకుదురు


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
KSM హైస్కూల్
చెంచుపేట, తెనాలి, గుంటూరుజిల్లా
నవ సమాజ నిర్మాణానికి కృషిచేసేది ఉపాధ్యాయులే... విద్యార్థులకు దశ, దిశా నిర్దేశం చేసేది గురువులే...
ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు, విద్యాశాఖాధికారులకు, ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు...
కొండూరి శ్రీనివాసరావు
సోషల్ స్టడీస్ టీచర్
కప్పల రాజారెడ్డి
ప్రధానోపాధ్యాయులు, కెఎస్ఎం హైస్కూల్


గురుపూజోత్సవ శుభాకాంక్షలతో...
జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల
సత్తెనపల్లి, పల్నాడు జిల్లా.
సత్తెనపల్లి మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు..
జె.మాధవిలత
ప్రధానోపాధ్యాయురాలు,
సత్తెనపల్లి


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులందరికీ టీచర్స్ డే శుభాకాంక్షలు...
శ్రీ వి.ఏసుబాబు
M.Sc., B.Ed.,
డిప్యూటీ డి.ఇ.ఓ.
ఎ.శ్రీనివాసరావు
M.E.O.
సత్తెనపల్లి.
రాఘవేంద్రరావు
M.E.O.-2
సత్తెనపల్లి.
ఎం.సీతారామిరెడ్డి
M.E.O.-2
ముప్పాళ్ళ
బి.మల్లిఖార్జునశర్మ
M.E.O.-1
రాజుపాలెం
శ్రీ ఎం.వెంకటేశ్వర్లు
D.E.O.
పల్నాడుజిల్లా.
ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (APPUSMA) - సత్తెనపల్లి
గౌరవాధ్యక్షులు : ప్రొఫెసర్ వి.సుబ్బారాయుడు
జనరల్ సెక్రటరీ : జి.శివకుమార్ రెడ్డి
అధ్యక్షులు : కె.ఎస్‌కె.మహబూబ్ సుభాని
ట్రెజరర్ : ఎన్.రామారావు


టీచర్స్ డే శుభాకాంక్షలు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - కఠెవరం
తెనాలి మండలం, గుంటూరుజిల్లా.
గురువు విద్యతోపాటు విచక్షణ కూడా నేర్పిస్తాడు... ఆ విచక్షణే మనల్ని మంచివైపు నడిపిస్తుంది... ఈ విచక్షణ పాఠ్యపుస్తకాల్లో ఉండదు... ఉపాధ్యాయుడి గుండెల్లో ఉంటుంది మన:పూర్వకంగా పాఠాలు చెప్పే ప్రతి ఉపాధ్యాయుడికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
తాటి శ్రీధర్
ప్రధానోపాధ్యాయులు
జెడ్‌పిహెచ్‌ఎస్- కఠెవరం


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
కొప్పునూరు - మాచర్ల మండలం
మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తూ...
పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలను సరస్వతి పుత్రులుగా తీర్చిదిద్దుతూ..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవార్డులనెన్నో అందుకున్న ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు సారథ్యంలో నడుస్తున్న పాఠశాలకు పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులకు, పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు...
విద్యార్థుల తల్లిదండ్రులు
తూబాటి సత్యనారాయణ
రిటైర్డ్ తెలుగు మాస్టర్
ఐ.వి. నాగమణి
ప్రధానోపాధ్యాయురాలు